నవతెలంగాణ
ఆదిలాబాద్
1
శనివారం | ఫిబ్రవరి 17, 2024 | www.navatelangana.com

డీపీఆర్వోగా తిరుమల బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారిగా తిరుమల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని డిపిఆర్‌ఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా ఆమెకు ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌తో పాటు అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని వేరువేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.



అబద్ధపు ప్రచారం చేస్తే సహించ : ఎంపీ సోయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తాను పార్టీ మారుతున్నట్లు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి ఆరోపణలు సహించేది లేదని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు పేర్కొన్నారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మీడియా చిట్‌చాట్‌లో సిట్టింగ్ ఎంపీ బాపురావు కాంగ్రెస్‌లో చేరేందుకు ట్రై చేస్తున్నారని ఆరోపించడంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాథోడ్ రమేష్‌కు పార్టీలు మారడం అలవాటు ఉందన్నారు. స్వార్థం కోసం ఇంకొకరిపై నిందలు వేయడం సరికాదని, తనకు టికెట్టు వచ్చిన, రాకపోయినా బీజేపీలో చివరి రక్తపు బొట్టు వరకు ఉంటానని తేల్చి చెప్పారు. మరోసారి ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తే తానేంటో చూపిస్తానని హెచ్చరించారు.

గ్రామీణ సమ్మె సంపూర్ణం..!

- జిల్లా, మండల కేంద్రాల్లో హోరెత్తిన నిరసనలు
- గ్రామీణ బంద్‌కు మద్దతు తెలిపిన కార్మికులు, కర్షకులు
- కేంద్రం వైఖరిపై పార్టీలు, ప్రజాసంఘాల మండిపాటు
- రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పార్టీలు, ప్రజా, రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ సంపూర్ణమైంది. ఉదయం నుంచే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, రైతులు పెద్ద ఎత్తున ఈ బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. జిల్లా, మండల కేంద్రాలు నిరసనలతో హోరెత్తాయి. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేయూ), కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన ఈ గ్రామీణ బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్ధతు పలికారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ వంటి ప్రజా సంఘాలతో పాటు సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ ప్రజాపంథ తదితర రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా మద్ధతు తెలిపి ఈ బంద్‌లో పాల్గొన్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా చేపట్టిన ఈ నిరసనలో కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సభ నిర్వహించారు. తొలుత స్థానిక ఆర్అండ్‌బీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అక్కడే సభ నిర్వహించగా.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.సోమన్న, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆయా పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ పార్కు నుంచి ఎన్‌టీఆర్ స్టేడియం వరకు మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించగా సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయగా..ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆయా సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో అక్కడి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వివిధ మండల కేంద్రాలు, పలు గ్రామీణ ప్రాంతాల్లోనూ నిరసనలు నిర్వహించారు.

కేంద్రం తీరుపై మండిపాటు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతులు, కార్మికుల పట్ల అనుసరిస్తున్న వైఖరిపై ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ అనుసరిస్తున్న మతతత్వ, ఆర్థిక విధానాల కారణంగా ప్రజల జీవనాదాయం పడిపోయి పేదల సంఖ్య పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగం పోరాటం ఫలితంగా మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రాత పూర్వకంగా ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మళ్లీ రాయితీలను ప్రకటిస్తూ మోసం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను బానిసలు చేస్తోందని తెలిపారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర గ్యారెంటీ చేసి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలతో పాటు పెన్షన్ రూ.10వేలు అందించాలని స్పష్టం చేశారు. అందరికీ గృహ వసతి కల్పించాలని, గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు అందించాలని, రైల్వే, రక్షణ, విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయరాదని పేర్కొన్నారు. ధరల పెరుగుదలను అరికట్టాలని, ఆహార వస్తువులు, నిత్యావసరాలపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని తెలిపారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు.



అభివాదం చేస్తున్న మాజీ మంత్రి రామన్న, వివిధ సంఘాల నాయకులు



ర్యాలీలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

కళాశాలలో జాబ్ డ్రైవ్‌కు స్పందన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో ఎస్బీఐ లైఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ డ్రైవ్‌కు స్పందన వచ్చింది. కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా జాబ్ డ్రైవ్‌ను ఏర్పాటు చేశారు. ఈ డ్రైవ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ అనిత, ఎస్బీఐ లైఫ్ అధికారులతో కలిసి మేళాను ప్రారంభించారు. అనంతరం అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి వారికి ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ ఉద్యోగంలో స్థిరపడాలనే ఉద్దేశ్యంతో ఈ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాదు ప్రయివేట్ ఉద్యోగాల్లో కూడా రాణించాలని సూచించారు. కాగా ఈ జాబ్ డ్రైవ్‌లో 122 మంది హాజరుకాగా అందులో 32 మంది షార్ట్ లిస్ట్ అయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వీరికి తదుపరి ఇంటర్వ్యూ హైదరాబాద్‌లో ఉంటుందన్నారు. ఎంపికైన వారికి ఆదిలాబాద్ పట్టణంలో పోస్టింగ్ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ డ్రైవ్‌లో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావు, కోఆర్డినేటర్ కోటయ్య, మెంటార్ చైతన్యకృష్ణ, ఎస్బీఐ లైఫ్ నుండి సురేష్ నాయక్, సాయన్న పాల్గొన్నారు.

మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యంపై అవగాహన



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని చించాల గ్రామంలో శుక్రవారం మొక్కజొన్న ఎరువులో యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ముధోల్ ఏరువాక కేంద్రం చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ కార్తీక్ క్షేత్రస్థాయిలో వెళ్లి అవగాహన కల్పించారు. అధిక ఎరువుల వలన కలిగే నష్టాలు, సరైన సమయంలో చేపట్టే సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు శివాజీ, ముత్యం, శివురాం, భూషణ్, సాయినాథ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా అద్దాల మేడ ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీనవశక్తి దుర్గా మాత ఆలయ ప్రాంగణంలో నిర్మించిన అద్దాల మేడ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని ఉదయం నుండే ప్రత్యేక పూజలు జరిపి అద్దాల మేడలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కిషన్ మహారాజ్ నేతృత్వంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తి శ్రద్ధల నడుమ జరిపారు. మాజీ మంత్రి జోగురామన్న ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అద్దాల మేడ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పూజాది కార్యక్రమాల్లో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. గణపతి పూజ, పున్యాహవచనం, నవ చండీ యాగం, హారతి, మంత్ర పుష్పం వంటి పూజాది క్రతువులను పండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు.

కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన మండల కేంద్రానికి చెందిన జాదవ్ రాజ్‌కుమార్‌ను శుక్రవారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అభినందించి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని, నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి నైపుణ్యం కలిగిన రంగాల్లో రాణించాలని సూచించారు. సన్మాన కార్యక్రమంలో డీఈ విఠల్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, గ్రామ పెద్దలు దేవుకాబాయి, శ్రీనివాస్, బాలాజీ పాల్గొన్నారు.

కార్మిక కర్షక విధానాలను వ్యతిరేకించాలి

- కాగజ్‌నగర్‌లో భారీ ర్యాలీ, రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక విధానాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కాగజ్‌నగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం ఇచ్చిన అనంతరం ఎన్టీఆర్ చౌక్ వరకు కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ కార్మిక, కర్షక, ప్రజల సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఆ మాటను నిలబెట్టుకోలేదని అన్నారు. బీజేపీ విధానాల వల్ల కార్పొరేట్ సంస్థల లాభాలు గరిష్టస్థాయికి చేరుకున్నాయని అన్నారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు ఆర్ త్రివేణి మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పరం చేస్తోందని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం అంగీకరించడం లేదని అన్నారు. కోట్లాది మంది కార్మికులకు వర్తించే ఈపీఎఫ్, పెన్షన్ పెంపు, పాత పెన్షన్ విధానం తదితర అంశాలను లెక్కలోకి తీసుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు నగరం పద్మ, జిల్లా కమిటీ సభ్యులు శంకర్, నాయకులు సంజీవ్, మల్లేష్, యు రవి, అంకన్న, వై అరుణ, సరస్వతి, పంచశీల, రజనీ, రజిత పాల్గొన్నారు.

ముధోల్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయి గోదాంలో పనిచేసే కార్మికులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందన్నారు. కార్మికులకు వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్‌పై కేంద్రం ఎక్సైజ్ సుంకం తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించాలని, 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు కోడిబ, గౌతమ్, బధర్, శివాజీ, మసూద్, దిగంబర్, హైమద్, శంకర్ పాల్గొన్నారు.

సిరికొండ : ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు, కర్షకులు సమ్మె బాట పట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, మల్టీ పర్పస్ వర్కర్లు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు మల్లేష్, దీపక్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ముధోల్‌లో..



సిరికొండలో..

తహసీల్దార్, ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-వేమనపల్లి

మండల నూతన తహసీల్దార్‌గా కె.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సదానందం ఎన్నికల బదిలీలలో భాగంగా భీమారం మండలానికి వెళ్లారు. జైపూర్‌లో ఉన్న కె.రమేష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ సహకరించాలని కోరారు.

ఎంపీడీఓగా దేవేందర్‌రెడ్డి..

ఎంపీడీవోగా ఎం.దేవేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా నిర్మల్ జిల్లా కుంటాల మండల ఎంపీడీవోగా ఉన్న ఆయనను మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందజేస్తానని తెలిపారు.



కల్వరీ చర్చి ప్రవీణ్ ఫౌండేషన్‌కు రక్తదాత అవార్డు



నవతెలంగాణ - కాసిపేట

బెల్లంపల్లి, సోమగూడెం రహదారి మధ్యలోని కల్వరీ చర్చి ప్రవీణ్ ఫౌండేషన్ విశిష్ట రక్తదాన అవార్డు అందుకున్నారు. శుక్రవారం మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బదావత్ సంతోష్ చేతుల మీదుగా కల్వరీ చర్చి ప్రవీణ్ ఫౌండేషన్ తరుపున వారి ప్రతినిధులు శ్రీనివాస్, శ్యామ్యూల్ అవార్డును, పత్రాన్ని అందుకున్నారు. ప్రాణాలను నిలిపే రక్తదానానికి మించిన దానం లేదని భావించి, రక్తదానం చేయండి, జీవితాన్ని కాపాడండి అనే నినాదాన్ని నరనరాన జీర్ణించుకొని రక్తదానం చేయడమే కాకుండా అందరికీ అవగాహన కల్పిస్తూ 2015 నుంచి రక్తదాన శిబిరాలు పెట్టి రెడ్ క్రాస్ సొసైటీ, తలసేమియా వ్యాధి గ్రస్థులకు రక్తాన్ని అందిస్తూ ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారు. కల్వరీ చర్చి పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారూన్‌కు వారు చేస్తున్న విశిష్ట రక్తదాన స్వచ్ఛంద సేవకు రెడ్‌క్రాస్ సొసైటీ తరపున ప్రవీణ్ ఫౌండేషన్‌కు ప్రకటించిన బ్లడ్ డోనర్ మోటివేటర్ మెరిట్ సర్టిఫికెట్, స్వచ్ఛంద సేవా అవార్డును ప్రకటించి కలెక్టర్ చేతుల మీదుగా అందించారు.

18న ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 18న ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడి భీమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలలో ఈ పరీక్ష నిర్వహించనున్నామని, కాగజ్‌నగర్‌లో స్థానిక వసుంధర డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుండి 12-30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని, ప్రతిభ కనబర్చిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేదా 8886561367కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. మొత్తం 100 మార్కులతో ఓఎంఆర్ షీట్ విధానంలో సీసీఈ ప్యాటర్న్‌కు అనుగుణంగా ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాజ్యసభ సభ్యుల ఎంపిక పట్ల కాంగ్రెస్ నాయకుల హర్షం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీనియర్ లీడర్ రేణుక చౌదరితోపాటు యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మందాడి అనిల్ కుమార్‌ను రాజ్యసభకు ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర, రాష్ట్ర అధినాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. మందాడి అనిల్‌కుమార్ యువజన కాంగ్రెస్ విభాగంలో పనిచేసి ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు సముచిత స్థానం దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. కష్టపడి పనిచేసి వారికి తప్పక గుర్తింపు ఉంటుందని తెలియజెప్పడానికి ఇదే మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. అనిల్ కుమార్‌కు ఆదిలాబాద్ జిల్లాతో మంచి అనుబంధం ఉందని, రాజ్యసభలో ఈ జిల్లా సమస్యలపై తన గళం వినిపించి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.

బాండ్ల రద్దుతో సమాచార హక్కు చట్టానికి ప్రాణం

నవతెలంగాణ-బోథ్

దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ వెలువరించిన తీర్పుతో సమాచార హక్కు చట్టం 2005 నకు ప్రాణం పోసినట్టయిందనీ ఆర్‌టీఐ ఆక్టివిస్ట్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి షేక్ షాకీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నికల బాండ్ల విషయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నప్పుడల్లా ఎన్నికల బాండ్ల గోప్యత అంటూ బాండ్ల విరాళాల సమాచారాన్ని బహిర్గతం చేసేవారు కాదన్నారు. అలాగే ఇటీవల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పుతో ఇకపై ఎన్నికల బాండ్ల రూపంలో ఎవరు ఏ పార్టీకి ఎంత విరాళాలు ఇచ్చారో దేశంలోని ప్రతి పౌరుడు తెలుసుకోవచ్చున్నారు. అదే విధంగా స్వేచ్ఛాయుత న్యాయబద్ధతతో కూడిన ఎన్నికలు జరగడం ప్రజాస్వామ్య మనుగడకు చాలా ముఖ్యం అన్నారు. అలాగే స్వేచ్ఛాయుత ఎన్నికలను కోరుకోవడం ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్య హక్కు అన్నారు. అదేవిధంగా బాండ్ల రద్దును స్వాగతించారు. సమావేశంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీర్చాలి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని తీర్చాలని ఎంపీడీఓ రమేష్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే మండలంలోని గిరిజన గ్రామాలు లెండిగూడ, జైతుగూడ, మహదు గూడ, నాగుగూడ, గ్రామాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే వేసవి కాలం దగ్గర పడటంతో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంటుందని అన్నారు. స్పందించిన ఎంపీడీఓ వారం రోజుల లో తాగునీటి సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే నీటి ఎద్దడి లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ కమిటి సొనాల అధ్యక్షులు జుగ్నాక్ మారుతి, కార్యనిర్వహణ అధ్యక్షులు పెస్వే సంగ్రామ్, ఉపాధ్యక్షులు మానిక్‌రావు, కార్యదర్శులు భీంరావు, గెడం బండు, సంభు, పాల్గొన్నారు.



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించుతాం

- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు సోమన్న
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలు చోట్ల ర్యాలీలు



ఆదిలాబాద్‌లో..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మిక, ప్రజావ్యతిరేక చట్టాలు తీసుకువస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న అన్నారు. శుక్రవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సమ్మెలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకుముందు పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ నుండి కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ బైఠాయించి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు సోమన్న మాట్లాడుతూ అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం కార్మికులను బానిసలుగా చేయడమేనన్నారు. కనీస



దిలావర్‌పూర్: నిర్మల్‌లో..

వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికారని ఎద్దేవా చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలను నిర్ణయించేందుకు అంగీకరించడం లేదని తిరిగి కార్మికులకు 12 గంటల పని విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. అదేవిధంగా వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా ఉన్న గ్రామీణ ఉపాధి హామీ చట్టం బడ్జెట్ తగ్గిస్తూ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణాలకు విస్తరించేందుకు బీజేపీ ప్రభుత్వం నిరాకరిస్తుందన్నారు. ఈ సమ్మెతో నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, ప్రతి ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.నిత్యం పెరుగుతున్న ధరలను అరికట్టి ఆహార వస్తువులు, నిత్యావసరాల వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలన్నారు.

గిట్టుబాటు ధర కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రం..

రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. దేశంలోని మోదీ ప్రభుత్వం రైతులకు మద్దతు ఇస్తామని హామీ ఇచ్చి, పదేండ్ల కాలంలో ఆ హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఇచ్చిన హామీని నేరవేర్చాలని ఢిల్లీ చుట్టు ఉన్న రాష్ట్రాల రైతులు ఆందోళనలు చేస్తే వారిపై పోలీసులతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి రంగానికి నిధులు తగ్గించి, రైతు కూలీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక వర్గాన్ని కేంద్రం కాపాడేల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సుజాత, పెర్కా దేవిదాస్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అగ్గిమల్ల స్వామి, పండుగు పొచ్చన్న, జిల్లా నాయకులు దర్శనాల నగేష్, సుమంతాయి, ఆత్మరామ్, మధునిక, రాణి, కవిత పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి : జోగురామన్న

దేశ ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిచేలా వ్యవహరిస్తోందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరముందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న పిలుపునిచ్చారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక, వ్యవసాయ సంఘాల పిలుపు మేరకు తలపెట్టిన సమ్మెలో ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం వాటి అమలులో ఘోరంగా విఫలమయిందని మండిపడ్డారు.

తాంసి : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ ఆధ్వరంలో దేశ వ్యాప్త బంద్‌ను కార్మికులు, కర్షకులు, రైతులు, రైతు కూలీలు ప్రజలందరూ తమ నిరసనను బంద్ రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంవీ యాక్ట్ 2019 చట్టం ద్వారా ప్రజా రవాణా వ్యవస్థలైన ఆర్టీసీలు పూర్తిగా కృషించిపోయాయి ముఖ్యంగా పర్మిట్ విధానాన్ని సవరించి స్టేజి క్యారియర్, కాంట్రాక్ట్ క్యారియర్ అనే విధానాన్ని సవరించి, ఒకే పర్మిట్ విధానం తీసుకురావడంతో రోడ్లపై ప్రయివేటు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. నామమాత్రపు పర్మిట్ రుసుము ఉండటం వల్ల రోడ్డుపై తిరుగుతున్న అక్రమ వాహనాలన్ని సక్రమ వాహనాలు అయిపోయాయని అన్నారు. ప్రజా రవాణా అయిన ఆర్టీసీ సంక్షోభంలోనికి కురుకుపోయింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భారతీయ న్యాయ సహిత బిల్లు డ్రైవర్లకు ఉరితాళ్లుగా తయారైందని అన్నారు. ప్రమాద వశాత్తూ వివిధ అనుకోని పరిస్థితులలో జరిగే యాక్సిడెంట్లలో డ్రైవర్లపై హిట్ అండ్ రన్ పేరుతో దాదాపు 10 సంవత్సరాల జైలు శిక్ష, పది లక్షల వరకు జరిమానా విధించాలని నిర్ణయించిందని అన్నారు. ఈ చట్టం అమలైతే డ్రైవర్లు అందరూ ఇందులో కాకుండా జైల్లో ఉండే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. భవిష్యత్తులో డ్రైవర్ అనే ఉద్యోగం చేయడానికి ఎవరు ముందుకొచ్చే పరిస్థితి ఉండదు ఇలా మొదలైన సమస్యలే కాకుండా రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర సరుకులు ధరలు సామాన్యుడు బ్రతకలేని పరిస్థితి ఏర్పడుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఆర్టీసీ జేఏసీ ఆదిలాబాద్, ఆదిలాబాద్ ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజనల్ కార్యదర్శి మిట్టపల్లి భీమ్‌రావ్, అధ్యక్షులు ఎస్.బీమ్‌రావు ఆదిలాబాద్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, ముత్యాల ఆశన్న, ఊశన్న, వెంకటేష్, దత్తు, సురేష్, ఐకేపీ మండల అధ్యక్షులు అరుణ్, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కడెం : కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయకుంటే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించడం ఖాయమని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి తొడసం శంభు అన్నారు. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఎస్‌బీఐ బ్యాంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. రైతాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే రద్దుచేసి, విత్తనాలు, ఎరువులు ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికవర్గం ఆధ్వర్యంలో బీజేపీని గద్దె దించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : అఖిలపక్షం పిలుపు మేరకు ఉట్నూరులో చిరువ్యాపారులు సంపూర్ణ బంద్ పాటించారు. వీరికి గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ మద్దతు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్మికులకు బంద్‌లో పాల్గొని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల, కార్మిక సంఘాల నాయకులు కార్మికులు, కర్షకులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయకుంటే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య అన్నారు. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతి భవనం నుంచి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి కమల, త్రివేణి, యూనియన్ అధ్యక్షులు గంగాధర్, కార్యదర్శి సురేష్, గ్రామపంచాయతీ యువజన అధ్యక్షుడు శేఖర్, నాగరాజు కార్యదర్శి పాల్గొన్నారు.

తలమడుగు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయం ముందు సమ్మె నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ వర్కర్లు, ఐకేపీ, అంగన్‌వాడీ ఉద్యోగులు గ్రామపంచాయతీ కార్మికులు ఒకరోజు తమ విధులను బహిష్కరణ చేసి సమ్మెలో పాల్గొన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించి, రిటైర్మెంట్‌మెంట్ బెనిఫిట్ కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష,కార్యదర్శిలు అనుసూయ, కళావతి, శోభ, స్వరూప, రమణ, లలిత, వినోద్, అశ్విని, రాదా, లక్ష్మి, మినా, భాగ్యమ్మ, సంగీత, ఉమాదేవి పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయకుంటే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పేర్కొన్నారు. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా నిర్మల్‌లోని గాంధీ పార్క్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న నలభై నాలుగు కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా మార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను సవరించారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, బ్యాంకింగ్, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, విమానయానం, మైనింగ్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు అప్పనంగా అమ్మేసి ఈ దేశ సంపదను కొల్లగొట్టారని విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన కోడ్‌లను వెంటనే రద్దుచేసి, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ విధానాన్ని వెంటనే రద్దుచేయాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం, ప్రతి కార్మికునికి నెలకు ఇరవై ఆరు వేల కనీస వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సదుపాయాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కార్మికులకు రోజుకు రూ.8వందలు ఇచ్చి పనులు జరిగే స్థలం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే రద్దుచేసి విత్తనాలు, ఎరువులు ధరలను వెంటనే



ఆదిలాబాద్‌లో..

తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికవర్గం ఆధ్వర్యంలో బీజేపీని గద్దె దించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష కార్మిక సంఘాలు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసచారి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ఎన్‌రెడ్డి, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి హరిత, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు రాజేష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, ఉపాధ్యాయ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, ఎన్‌పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు ఫసియోద్దీన్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, దిగంబర్ పాల్గొన్నారు.

దస్తురాబాద్ : కార్మికులకు వ్యతిరేకంగా



ఖానాపూర్‌లో..

తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూరు తిరుపతి అన్నారు. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ ఆఫీసు దగ్గర నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నర్సయ్య, బొమ్మెన రవి, గీతంజాలి, రత్నమ్మ దుర్గం వందన, డాకూర్ రాజమణి, అనసూర్య మంజుల, జాడి అమృత, మామిడి రాజేశ్వరి, గుండా నర్సవ్వ, చిట్యాల దుబ్బ రాజవ్వ, నరపాక లక్ష్మీ ఎండపల్లి లక్ష్మీ, రైతుసంఘం జిల్లా నాయకులు మునేసుల స్వామీ, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు అకొండపేట్ మాజీ సర్పంచ్ దుర్గం పోశలింగు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా జిల్లా కన్వీనర్ బలగురి రజిత, నర్సయ్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. దీంతో గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతు చట్టాలను ఉపసంహరించుకుంటామని చెప్పి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తోందని ధ్వజమెత్తారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల కారణంగా రైతులు, కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లంక రాఘవులు, ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గంద్రత్ రమేష్. బీఆర్ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, కడదరపు అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కడదారపు ఆశన్న, ఎన్.స్వామి, రైతు సంఘం జిల్లా నాయకులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా భారత్ గ్రామీణ బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం ఖానాపూర్ మండలంలోని సత్తెనపల్లి మంచిర్యాల రోడ్డుపై రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారం ఉన్నటువంటి నరేంద్ర మోడీ ప్రభుత్వం తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో రైతాంగానికి ఇచ్చినటువంటి హామీలు కార్మిక వర్గానికి ఇచ్చినటువంటి హామీలను అమలు చేయలేదని అన్నారు. మొత్తం దేశంలో ఉన్నటువంటి ప్రభుత్వ రంగ పరిశ్రమలు అన్నిటిని ఆదాని అంబానీలకు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారని అన్నారు. రైతాంగానికి మద్దతుల గ్యారంటీల చట్టం చేస్తానని హామీ ఇచ్చి మొండిచే చూపాడని అన్నారు. స్వామినాథం సిఫార్సులు అమలు చేస్తానని, చేయలేదని రైతాంగంపై 40 వేల కేసులు ఎత్తివేస్తానని హామీ ఇచ్చినటువంటి మోడీ ఇవాళ ఇచ్చిన హామీలను మర్చిపోయి పంజాబ్ హర్యాన రైతులు ఇవాళ ఢిల్లీ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున హామీలు అమలు చేయమని పోరాడుతుంటే వాళ్లపై టీయార్ గ్యాస్ ప్రయోగిస్తున్నటువంటి దుర్మార్గ పరిస్థితిని కొనసాగిస్తున్నాడని అన్నారు. నిరుద్యోగం దేశంలో తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో విపరీతంగా పెరిగిపోయిందని దారిద్ర్యం పెరిగిపోయిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు, మడావి అంకుశరావు, సుంచుల నారాయణ, మంచికంటి లక్ష్మణ్, భుక్య రమేష్, కుంచెపు ఎల్లయ్య, ఇబ్రహీం, గోపి నాయక్, సుదర్శన్, గుమ్ముల రమేష్, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, బేరా గంగాధర్, రాజన్న, ప్రభాకర్‌గౌడ్, మధు, వర్మ భీంరావు, గోపాల్, ఎల్లయ్య, మల్లారెడ్డి, లచ్చన్న, రమేష్, సురేందర్, రవి ఈ కార్యక్రమానికి మానవ హక్కుల ఫోరమ్ జిల్లా కార్యదర్శి ఆత్రం సుగుణలు పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ప్రింట్ మీడియా ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఈదపు రవీందర్, ప్రధాన కార్యదర్శిగా చింతల అరుణ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజ్ కిరణ్ రెడ్డి, కార్యదర్శిగా పిట్ల రాము, కోశాధికారిగా బదాల కిరణ్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఫొటో జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

ధర్మ విద్యాలయంలో ధర్మేంద్ర సింగ్ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గణిత శాస్త్రవేత్త సర్దార్ ధర్మేందర్ సింగ్ చాహిల్ జయంతిని వేడుకలను పట్టణంలోని ధర్మ విద్యాలయం పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సర్దార్ సోహన్ సింగ్ చాహల్, ప్రిన్సిపాల్ స్వప్నలత, మేనేజ్‌మెంట్ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగం సాధించిన సౌమ్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణానికి చెందిన మేకల భాస్కర్, గంగా భాగీర్థల కుమార్తె సౌమ్య స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగాన్ని సాధించారు. ఉన్నత చదువులు చదివినా ఆమె క్రీడల్లో సైతం పలు పతకాలను సాధించారు. క్రీడలపై ఉన్నా మమకారంతో ప్రయివేటు పీఈటీగా విధులు నిర్వహించారు. కఠోర శ్రమతో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగానికి అర్హత సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు కుటుంబ సభ్యులతో పాటు గురువులు అభినందనలు తెలిపారు.

కారుణ్య నియామకాల ధృవపత్రాల పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీలో కారుణ్య నియమకాల కోసం ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం సర్టిఫికేట్ల పరిశీలనను చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్హులైన అభ్యర్థులు కార్యాలయానికి వచ్చారు. వారి సర్టిఫికేట్లు, డాటాను అధికారులు పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 77 మందికి ఒక రోజు వేరిఫికేషన్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటి ఆర్ఎం ఆపరేషన్ ప్రణీత్ మాట్లాడుతూ సంస్థలో మెడికల్ అన్‌ఫీట్, చనిపోయిన వారి డిపెండర్లకు నియమాకాలు చేపట్టడంలో భాగంగా సర్టిఫికేట్ వేరిఫికేషన్ పూర్తి చేశామన్నారు. మెడికల్ అన్‌ఫీట్‌లో 17 మంది, చనిపోయిన వారి కుటుంబ సభ్యులు 60 మంది వేరిఫికేషన్‌కు హాజరయ్యారని తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన తరువాత ఎంపికైన వారికి కాల్ లెటర్ పంపిస్తామన్నారు. అనంతరం మెడికల్ టెస్టు నిర్వహించి ఉద్యోగంలో తీసుకుంటామన్నారు.

ఘనంగా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు జన్మదిన వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలు శ్రీహరిరావు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలను నిర్వహించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు 50 మందికి పరీక్షా ప్యాడ్‌లను, 400 మంది విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. పొట్టపెల్లి(కె) గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 35 మందికి పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వోడ్నాల రాజేశ్వర్, నాయకులు అట్లా రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, అట్లా రవీందర్ రెడ్డి, అట్లా రాంరెడ్డి, నగేష్, సమ్మెట రవి, నరేష్‌రెడ్డి, పోతారెడ్డి, ముత్యం, భూమన్న, శేఖర్‌రెడ్డి, నారాయణ, ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, రమేష్, సాగర్ సాయన్న కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీకి యత్నం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఓ మహిళ మెడలోంచి బంగారం దోచుకెళ్లేందుకు దుండగులు ప్రయత్నించిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర కేళాపూర్ జిల్లాకు చెందిన అన్నపూర్ణ తన తండ్రి ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి వచ్చారు. పని పూర్తయిన అనంతరం ఇంటికి తిరుగు ప్రయాణం చేపడుతున్న క్రమంలో శివాజీ చౌక్ ప్రాంతంలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు మహిళ మెడలోంచి లాగేందుకు ప్రయత్నం చేయగా, స్థానికులు పట్టుకున్నారు. ఒకరు చేతికి చిక్కినట్టే చిక్కి పారిపోయినట్టు తెలిపారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రూ.2కోట్లు కేటాయించడం అభినందనీయం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

సంత్ శ్రీ సేవాలాల్ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతీ సంవత్సరం జయంతి వేడుకలకు రూ.2కోట్లు కేటాయించడం అభినందనీయమని లంబాడ జేఏసీ నిర్మల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు భుక్యా గోవింద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

నేరడిగొండ : మండల కేంద్రంతో పాటు బోందిడి గ్రామంలో శుక్రవారం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాథోడ్ సజన్ మాట్లాడుతూ బంజారుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అన్నారు. ప్రతి బంజారా బిడ్డ ఆయన చరిత్ర తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బంజారాలు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. అఖిల భారత ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ 1 సెప్టెంబర్ 2004లో నియమకమైన వారికి నూతన పెన్షన్ విధానం అమలులోకి వచ్చిందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇన్‌కం ట్యాక్స్ పరిమితి రూ.5లక్షల నుంచి పది లక్షలకు పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, గోపి, చంద్రశేఖర్, ప్రశాంత్, విక్రంత్, భూమన్న, సంతోష్, రాధ, సుజాత, అన్నపూర్ణ, రాజేష్, సంధ్యారాణి, మహేందర్, అరుణ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎంపీడీఓను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-జైనూర్



సిర్పూర్(యు) మండలంలో నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్‌ను కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడిమెత విశ్వనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వం నుండి వచ్చిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వంద శాతం అందించేలా కృషి చేయాలని కోరారు. గిరిజన మండలంలో ప్రతి ఒక్కరికి పథకాలు అందించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్(యు) కాంగ్రెస్ నాయకులు ఆత్రం దౌలత్, షేక్ ఆరీఫ్, ఆత్రం దత్తు, జైపాల్, శ్రీనివాస్, హుస్సేన్‌ఖాన్, కాశీరాం పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను వాలీబాల్ టీం యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాలలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్, ఎంపీపీ డుబ్బుల నానాయ్య క్రీడాకారులను పరిచాయం చేసుకొని ప్రారంభించారు. మొదటి బహుమతిగా రూ.12 వేలు, రెండవ బహుమతి రూ.8 వేలు అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మానసిక ఉల్లాసంతో పాటు స్నేహ సంబంధాలు పెరుగుతాయని ఈ సందర్భంగా అతిథులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ నాజీమ్ హుస్సేన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు డబ్బుల వెంకన్న, సహకార సంఘం మండల ఉపాధ్యక్షులు టొంబ్రే మారుతి, నాయకులు భీంకరి నారాయణ, మాజీ సర్పంచ్ మేకల ప్రసాద్, టొంబ్రే సురేష్, మహేష్, పాలే సత్తయ్య, టొంబ్రే శ్రీనివాస్ పుంజారి సాయి, గాట్లే శంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

చింతగూడ పాఠశాలను సందర్శించిన ఆర్ఎస్పీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని చింతగూడ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సందర్శించారు. పాఠశాల పూర్వ పరాలను తెలుసుకొని పేద విద్యార్థులకు చేస్తున్న సేవలకు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఆర్ఎస్పీని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

కాంగ్రెస్ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేమని కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు మౌల్కర్ మారుతి అన్నారు. శుక్రవారం తెలంగాణ కిసాన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి పిలుపు మేరకు మండల కేంద్రంలో రైతులతో కలిసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకుండ, మద్దతు ధర కల్పించకుండా రైతులను మోసం చేసిందన్నారు. రైతులకు న్యాయం చేయకుండా మోసపూరిత మాటలు చెప్పి ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత స్వామినాథన్ చేసిన సిఫారసులను అమలుచేయడానికి సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తుందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం చేపట్టడానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొండు శంకర్, యూత్ అధ్యక్షుడు లాట్కారి శంకర్, మహిళ మండల అధ్యక్షురాలు ఖాతా అనుసుర్య, మండల నాయకులు శంక్రు బాయి, దాస్తగిరి, కిసాన్ రావ్, బుధాజీ, ఇప్ప శ్రీనివాస్, నారాయణ, మల్లేష్, శ్రీనివాస్, పుల్లయ్య పాల్గొన్నారు.

అధికారులకు బదిలీలు సహజం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికారులకు బదిలీలు సహజమని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆసిఫాబాద్ ఎంపీడీఓ, ఎంపీఓలుగా పనిచేసిన శశికళ, ప్రసాద్ బదిలీ అయి వారి స్థానంలో శ్రీనివాస్, మౌనికలు బాధ్యతలు స్వీకరించగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగేశ్వరరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు బదిలీలు కావడం సహజమని, పని చేసిన చోట ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. సమస్యలతో వస్తున్న ప్రజలకు సరైన సమాధానాలు చెప్పే వారి సమస్యలు తీర్చేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ అలీబీన్ అహ్మద్, నాయకులు గంధం శ్రీనివాస్, సెక్రెటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన పి.సత్యనారాయణను మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షెకిల్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో సమస్యలను గుర్తించి మండల అభివృద్ధికి తోడ్పడాలని, పార్టీ నాయకుల సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, కాంగ్రెస్ జిల్లా వికలాంగుల అధ్యక్షుడు ఇప్ప రవిశంకర్, కిసాన్ మండల అధ్యక్షుడు లెండుగురె శంకర్, మండల ఉపాధ్యక్షుడు కోహెడ రమేష్‌గౌడ్, మండల నాయకులు వినాయక్ అలీ, సోషల్ మీడియా ఇన్‌చార్జి మహేందర్ అన్నారు.

చింతలమానపల్లి : ఎంపీడీఓగా కోట ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి బదిలీపై తిర్యాణి వెళ్లగా, ఆ స్థానంలో ఆసిఫాబాద్ నుంచి కోట ప్రసాద్ బదిలీపై వచ్చారు. శుక్రవారం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ప్రజలు, అధికారులకు అందుబాటులో ఉండి, సహాయ సహకారాలతో, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

మేడారం ప్రసాదం డోర్ డెలివరీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

టీఎస్ ఆర్టీసీ ద్వారా మేడారం సమ్మక్క సారలమ్మ ప్రసాదాన్ని డోర్ డెలివరీ అందించనున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడారం జాతరకు వెళ్లలేని పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు మేడారం బంగారాన్ని ఆర్టీసీ కార్గో ద్వారా డోర్ డెలివరీ చేయనున్నట్లు తెలిపారు. ప్రసాదాన్ని బుక్ చేసుకోవడానికి ఈనెల 25వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ప్రసాదాన్ని బుక్ చేసుకోవాలనుకునేవారు ఆసిఫాబాద్ డిపో పరిధిలోకి వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో బుకింగ్ చేసుకోవచ్చన్నారు. జాతర తర్వాత ప్రసాదం డోర్ డెలివరీ చేస్తామన్నారు. వివరాలకు 9154298534 నెంబర్‌ను సంప్రదించి బుకింగ్ చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్‌పై విమర్శలు మానుకోవాలి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం బీఆర్ఎస్, బీజేపీలకు మింగుడు పడక పార్టీపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు జుంగరి శేఖర్ అన్నారు. శుక్రవారం మండలలోన రవీంద్ర నగర్-1 గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీల హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. మహిళ ఉచితంగా బస్సులో ప్రయాణం చేస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి వారితో మాట్లాడి, ధర్నాలు, ఆటో బందుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బొరుకుట్టి వెంకన్న, నాయకులు ప్రవీణ్ లోడిల్లి, రాపల్లి రామయ్య పులాజి రాజు, తపన్ మండల్, తిరుపతి, అంకులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మె విజయవంతం

- కదిలిన కార్మిక లోకం
- సమ్మెతో దద్దరిల్లిన జిల్లా కేంద్రం
- కార్మికులతో కలిసి భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట సంఘాల ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెతో జిల్లా కేంద్రం దద్దరిల్లింది. అంబేద్కర్ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు కార్మిక సంఘ నాయకులు కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు అయిన రైతాంగ, కార్మికవర్గ, ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. నిరుద్యోగం 50 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరిందని, శ్రామికుల నిజ వేతనాలు 20 శాతం తగ్గిపోయాయని, ప్రపంచంలోని 125 దేశాల్లో ఆకలిలో భారత్ 111వ స్థానంలో ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్రం విధానాలను నిరసిస్తూ చేపట్టిన బంద్ విజయవంతమైందన్నారు. సహకరించిన కార్మిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పెరక శ్రీకాంత్, బాలకిషన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు తిరుపతి, టీయూసీఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, నాయకులు జ్యోతి, రమ, ఫైమ, మాట్ల రాజు, లక్ష్మి, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షులు స్వరూప, వనిత, లక్ష్మి సూర్యమణి, సువర్ణ, సరోజ పాల్గొన్నారు.

కెరమెరి : దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనందరావు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ షరీఫ్‌కు వినతిపత్రం అందించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు అనసూయ, గుణసుందరి, మంజుల, తాను బాయి, విమలబాయి, సావిత్రి, ఆయూ బాయి పాల్గొన్నారు.

చింతలమానపల్లి : దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ మండలంలో విజయవంతం అయింది. సీఐటీయూ మండల కన్వీనర్ డోర్లికర్ విలాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్లు వెంకటి, రవి, శ్యామ్ రావు, వెంకటి, రమేష్, ఆశ వర్కర్ల మండల అధ్యక్షురాలు ప్రమీల, ప్రధాన కార్యదర్శి అనురాధ, హంస, లక్ష్మి పాల్గొన్నారు.

రెబ్బెన : దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైటాయించి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్ మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక బాధ్యత పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయిల్ల నర్సయ్య, సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి అరికిల్ల స్వామి, కార్యదర్శి లక్ష్మినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సీహెచ్ అశోక్, సహాయ కార్యదర్శి సాగర్‌గౌడ్, కార్మికులు సత్తయ్య, శ్రీనివాస్, తిరుపతి, రవి పాల్గొన్నారు.

కార్మిక సంఘాల రాస్తారోకో..

కేంద్ర బీజేపీ ప్రభుత్వ, కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం మండలకేంద్రంలో జాతీయ రహదారిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. 36 సార్లు దేశవ్యాప్తంగా సమ్మె జరిగిన మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమం కోసం పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులను కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అరికిల్ల స్వామి, రాజాగౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, కృష్ణ, తిరుపతి, సాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖైరిగూడ ఓసీపీ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన

శుక్రవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గోలేటి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భయ్య మొగిళి, ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, జూపాక రాజేష్, కిరణ్‌బాబు, శేషుపంతులు, దివాకర్, కృష్ణమోహన్, పుట్ట అంజయ్య, తిరుపతి, సుదీర్, రాంకిశన్, రవీందర్, ఓదెలు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుండి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైటాయించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉమా, విమల, కోశాధికారి అర్చన, మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కోశాధికారి రూప, లక్ష్మి, అంకుబాయి, ఆశావర్కర్ల యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కేసర, కవిత, నిర్మళ, శారద పాల్గొన్నారు.

కౌటాల : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మోర్లె నాగేష్, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు జాడి మొరేశ్వర్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల ఐక్యవేదిక దేశవ్యాప్త సమ్మె పిలుపు మేరకు నిర్వహించిన బంద్ మండలంలో విజయవంతమైంది. మధ్యాహ్నభోజన కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు బందులో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

దహెగాం : కార్మిక, కర్షక గ్రామీణ బందులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ సంఘాలతో కలిసి చేపట్టిన సమ్మె మండలంలో విజయవంతమైంది. సమ్మెలో భాగంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చంద రమేష్, సీఐటీయూ జిల్లా నాయకురాలు వజ్రమ్మ, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన కార్మికులు, పంచాయతీ రాజ్ కార్మికులు పాల్గొన్నారు.

జైనూర్ : కేంద్ర ప్రభుత్వం కార్మికులకు చేస్తున్న అన్యాయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల నాయకులు సోనేరావు అన్నారు. శుక్రవారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలకేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గామ పంచాయతీ కారోబార్ కాృమె అంకూశ్, సీఐటీయూ నాయకులు, ఆశా, అంగన్‌వాడీలు, మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.









మూఢనమ్మకాలను దూరం చేయాలి

- విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సైన్స్ గురించి తెలుసుకుంటు మూఢనమ్మకాలను విద్యార్థులు దూరం చేసుకోవాలని, వైజ్ఞానిక దృక్పథాన్ని పెంచుకోవాలని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ కళాశాలలో విద్యార్థులకు మూఢనమ్మకాలను తొలగించడంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సమాజంలో సైన్స్ ఎంతో అభివృద్ధి చెందుతుందో అంతే స్థాయిలో మూఢనమ్మకాలు పెరుగుతున్నాయన్నారు. పేద ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిలో పెరుగుతుండడం విచారకరం అన్నారు. దయ్యాలు, భూతాలు కూడా పేదలకే పడతాయని, డబ్బున్న వారికి పట్టవన్నారు. మూఢనమ్మకాల ప్రభావం మహిళలపై అధికంగా ఉందని, వాటిని నిర్మూలించడమే విజ్ఞాన దర్శని ప్రధాన లక్ష్యమన్నారు. ఆ దిశగా విజ్ఞాన దర్శని అడుగులు వేస్తుందన్నారు. ఫిబ్రవరి సైన్స్ రంగానికి చాలా ప్రాముఖ్యత కలిగిన నెల అని ఈ నెలలోనే జాతీయ సైన్స్ దినోత్సవంతో పాటు సూర్య కేంద్ర సిద్ధాంతం చెప్పిన కూపర్నికస్ జీవ పరిణామ సిద్ధాంతం చెప్పిన డార్విన్ లాంటి గొప్ప వ్యక్తులు ఎంతోమంది ఇదే నెలలో జన్మించారన్నారు. ఈ నెలను సైన్స్ మాసోత్సవ వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. దేశంలో సైన్స్, సైంటిఫిక్ టెంపర్‌ను దెబ్బతీస్తున్న పాలకులు రాజ్యమేలుతున్న తరుణంలో వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రచారం చేయడమే ఈ "విజ్ఞానయానం" లక్ష్యమన్నారు. అనంతరం విజ్ఞాన దర్శిని సభ్యులు శోభారాణి, మహమ్మద్ అలీ, మహేష్ చిట్టబోయినలు వండర్ సైన్స్ షోను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టికానంద్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కోరంగ మాలశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజ్ కుమార్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో మాట్లాడుతున్న విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్

వాంకిడి : మండలకేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజ్ఞానదర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైన్స్ ఎంతో అభివృద్ధి చెందుతుందో అంతే స్థాయిలో ప్రజల్లో మూఢనమ్మకాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, చంద్రయ్య, తిరుపతి, సంతోష్, కిరణ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలో జమ చేసుకోండి



నవతెలంగాణ-కౌటాల

కూలీ, నాలి చేసుకొని కష్టార్జీతమైన సొమ్మును దళారుల వద్ద దాచకుండా మినీ బ్యాంకు ఖాతాలో వేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో లబ్ధిదారునికి బీమా చెక్కును అందజేసి మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం క్రింద రూ.436 చెల్లిస్తే అనారోగ్య కారాణాల వల్ల చనిపోతే రూ.రెండు లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఇటీవల గుండాయిపేట్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి లలితాబాయి చనిపోవడంతో ఆమె భర్తకు రూ.రెండు లక్షల బీమా పరిహారం చెక్కును అందజేశారు. అర్హులైన ఖాతాదారులు ప్రతి ఒక్కరు ఇలాంటి బీమా చేసుకోవడం వల్ల దురదుష్టవశాత్తు చనిపోయిన కుటుంబం రోడ్డున పడకుండా బీమా కుటుంబానికి దీమాగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌటాల శాఖ క్షేత్రాధికారి మనోహర్, అకౌంటెంట్ రాజేష్, క్యాషియర్ గోపి, మహిళా సంఘాల ప్రతినిధులు సీసీ కుసుమ, సీఏ రవి, బ్యాంకు మిత్ర నీరజ, ఖాతాదారులు పాల్గొన్నారు.

జన్‌మన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకొని అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తుందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొనేలా మండల అధికారులు వారికి సహకరించాలని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం మండలంలోని పూసిగూడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఈ పథకంలో టీవీటీజీ సర్టిఫికేట్ ఉన్నవారు లబ్ధి పొందవచ్చని, మండలంలో కొలాం, తోటి అనే తెగలు మాత్రమే ఉన్నాయని, ప్రతి ఒక్కరికి ఈ సర్టిఫికేట్‌ను అందించేలా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. అలాగే పూసిగూడలో నూతనంగా ఏర్పాటుకానున్న పోలింగ్ కేంద్రంలో మౌళిక వసతులు కల్పించాలని, గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఆర్ఐ జుగాడీరావు, ఇన్‌చార్జి ఎంపీఓ కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ఆదుకోవాలని ఆటో కార్మికుల ధర్నా



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ప్రభుత్వ పరంగా డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో యూనియన్ కార్మికులు శుక్రవారం మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్లుములే మల్లయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షులు షేక్ దాస్తగిరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి, ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు. ప్రయాణికులు ఆటోలలో ఎక్కకుండా బస్సుల్లో వెళ్తుండడంతో తమ కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం తమకు జీవన భృతి కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాయింట్ మాస్టర్ రియాజ్, ముంజం భుదజీ, మొర్లే బాబు రావ్, నాగేష్, తిరుపతి, సంతోష్, వెంకటేష్, రహీమ్ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారికి సన్మానం



నవ తెలంగాణ-కెరమెరి

సంఘవి గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారిగా మండల వ్యవసాయ అధికారి గోపికాంత్‌ని నియమించారు. శుక్రవారం సాంగ్వి గ్రామపంచాయతీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్ ఆధ్వర్యంలో శాలువతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

20 నుంచి సమ్మక్క, సారలమ్మ జాతర

నవతెలంగాణ-బెజ్జూరు

ఈ నెల 20 నుండి 23వ తేదీ వరకు మండలంలోని రేచిని అటవీ ప్రాంతంలో గల తెల్లరావుల గుట్ట వద్ద సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నికాడి బాబురావు, నికూరి అనంతరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతర ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సమ్మక్క, సారలమ్మ వనదేవతలను దర్శించుకొని విజయవంతం చేయాలని కోరారు.

లక్షెట్టిపేట ఎస్సైగా చంద్రకుమార్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెటిపేట నూతన ఎస్సైగా పి. చంద్రకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కలమడుగు, మురుమడుగు, వెంకటాపూర్, టీజీ పల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సి.రాజా మనోహర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోను దృష్టిలో పెట్టుకొని మండలంలోని 29 గ్రామపంచాయతీలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతులపై ఆరా తీస్తున్నామన్నారు. కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ భానుచందర్ ఉన్నారు.

మంచిర్యాల ప్రజలు ఎప్పటికీ బాధితులే

- అసెంబ్లీ లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

నవతెలంగాణ-హాజీపూర్



మంచిర్యాల నియోజకవర్గ ప్రజలు అన్ని రకాలుగా బాధితులేనని శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు కట్టి హాజీపూర్, లక్షెట్టిపేట్ మండలాల అనేక గ్రామాలు ముంపుకు గురయ్యాయన్నారు. సింగరేణికికు మంచిర్యాల నియోజకవర్గ ప్రజలే ఎక్కువ త్యాగం చేశారన్నారు. ఒక్క చుక్క నీరు కూడా రాలేదన్నారు. దీనిపై నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిని కలిసి ఈ ప్రాంత ప్రజల బాధలు విన్నవిస్తే గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ఇచ్చారన్నారు. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పాదయాత్ర చేస్తున్న సమయంలో మరో రెండు లిఫ్టులు ఇస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. వాటిని త్వరగా కార్యరూపంలోకి తీసుకువస్తే మిగిలిన భూములకు నీళ్లు పారతాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యధిక బాధితులు కూడా తామేనన్నారు. వర్షాకాలం వస్తే మంచిర్యాల పట్టణం ఎప్పుడు మునిగిపోతుందా అన్న భయం అందరిలో ఉందన్నారు. కరకట్టలు పటిష్టంగా నిర్మించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంచిర్యాల మున్సిపాలిటికి 1995లో బెస్ట్ మున్సిపాలిటీ అవార్డు వచ్చిందన్నారు. 2001లో కూడా అవార్డు వచ్చిందనీ తెలిపారు. గత ప్రభుత్వం మున్సిపాలిటీని లాస్ట్‌లో పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. మంత్రి కోమటి రెడ్డి స్పందించి సమస్యలు తీర్చడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

మిషన్ భగీరథ పనులపై విచారణ చేపట్టాలి

- అసెంబ్లీలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

నియోజకవర్గం పరిధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పనులపై విచారణ చేపట్టాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన నియోజకవర్గం పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో తిరిగినప్పుడు గ్రామీణులు నీటి ఇబ్బందులను వెల్లడించినట్లు తెలిపారు. గతంలో మాదిరిగా బోర్లు వేయించి నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలన్న గ్రామీణుల కోరిక మేరకు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వివరించినట్లు తెలిపారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి ఇదే విషయాన్ని తెలియజేయడం జరిగిందని, ఈ విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని నియోజకవర్గంలో నీటి సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా చెన్నూర్ పట్టణంలో సీసీఐ ద్వార ఏర్పాటు చేసిన పత్తి కొనుగోళ్ల రెట్టింపు చేయాలన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-మందమర్రి

మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం సమాచారం మేరకు విద్యానగర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. టీఎస్19టీ5683 వ్యాన్‌లో 30 క్వింటాళ్ల పీడీఎస్‌ను తరలిస్తున్నట్టు గుర్తించారు. బియ్యం విలువ రూ.60 వేలు ఉంటుందని ఎస్సై లచ్చన్న తెలిపారు. రామగుండం కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో పరిసర గ్రామాల నుండి పీడీఎస్ బియ్యాన్ని రవాణను ఆరికట్టేల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మందమర్రి నుంచి మహారాష్ట్రకు కనకయ్య అనే వ్యక్తి తరలిస్తున్నట్టు గుర్తించామని, అతన్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని పేర్కొన్నారు.

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



నవతెలంగాణ-జన్నారం

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పెద్దపెల్లి పార్లమెంటు సభ్యుడు బోర్లకుంట వెంకటేష్ నేత అన్నారు. శుక్రవారం మంచిర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పల్లె భూమేష్ స్వగృహం రాంపూర్‌లో ఆయన తండ్రి దశదినకర్మలో పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు, తెలంగాణలో బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని చూస్తుందన్నారు. కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మెన్ తిప్పని లింగయ్య, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ తిరుపతి, జన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యం సతీష్, పల్లె రాజన్న, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్, మంత్రి దేవయ్య ముస్తఫా, సీపీఎస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు దాముఖ కమలాకర్, జునుగురి మల్లయ్య, అలుగునూరి రవి, బోర్లకుంట ప్రభుదాస్, దాముఖ కరుణాకర్ పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ సక్సెస్



జైపూర్‌లో..

నవతెలంగాణ-జైపూర్

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ మంచిర్యాల జిల్లాలో విజయవంతం అయింది. కార్మిక సంఘాలు, వామపక్షాలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనలు తెలిపారు. కార్మికుల చట్టాలు, రైతులకు స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే జైపూర్‌లో కార్మిక సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ప్రభావిత గ్రామాల వారికి సింగరేణిలో శాశ్వత ఉద్యోగావకాశాలు కల్పించాలని హెచ్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల పిలుపు మేరకు శుక్రవారం చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొన్న కార్మికులతో కలిసి నాయకులు మాట్లాడారు. అనంతరం ఎస్టీపీపీ ఈడీ బసవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సమ్మెలో పాల్గొన్న ఎస్టీపీపీ కార్మికులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యమంలో హెచ్ఎంఎస్ అనుబంధ ఎస్టీపీపీ యూనియన్ ప్రధాన కార్యదర్శి విక్రమ్, వర్కింగ్ ప్రసిడెంట్ ప్రదీప్ రెడ్డి, కార్యదర్శి సాయికృష్ణారెడ్డి, వైస్ ప్రసిడెంట్ చిప్పకుర్తి సంపత్, ఎలుక రమేష్, రిక్కుల సంతోష్ రెడ్డి, సత్యనారాయణ చారీ, మల్లేష్, రిక్కుల నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లక్షెటిపేటలో..

మందమర్రి : ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను నిరసిస్తూ శుక్రవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అంతకు ముందు ర్యాలీగా వచ్చి కార్యాలయం ఎదుట కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా



మందమర్రిలో..

తీసుకువచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలను అమలు చేసి, పనికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు, ఓబి కార్మికులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, భారత్ బందులో భాగంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ లక్షెట్టిపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం మీదుగా గాంధీ చౌక్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ శోభ మాట్లాడుతూ దేశంలోని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా, కార్మిక వ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని కోరారు.

మాకు గౌరవం ఇవ్వడం లేదు

- సర్వసభ్య సమావేశంలో బీఆర్ఎస్ జెడ్పీటీసీల నిరసన
- అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని ఆరోపణ
- కలెక్టర్ చొరువతో శాంతించిన జెడ్పీటీసీలు



కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న బీఆర్ఎస్ జెడ్పీటీసీలు

నవతెలంగాణ-హాజీపూర్

రాష్ట్రంలో అధికారంలో కోల్పోయిన తరువాత అధికారులు తమకు గౌరవం ఇవ్వడం లేదంటు శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో బీఆర్ఎస్ జెడ్పీటీసీలు నేలపై కూర్చోని నిరసన తెలిపారు. సమావేశానికి హాజరైన కలెక్టర్ బదావత్ సంతోష్ జోక్యం చేసుకొని ఇక నుంచి జెడ్పీటీసీలకు సరైన గౌరవం అందించేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో జెడ్పీటీసీలు శాంతించడంతో సభ సాగింది. సభ ప్రారంభం కాగానే సభ్యులు తమకు ఏజెండా కాపీలు ఇవ్వకపోవడం మండిపడ్డారు. జెడ్పీ సీఈఓ నూతనంగా వచ్చారని, సమయం లేక ఏజెండా కాపీలను అందించలేకపోయామని తెలిపారు. వచ్చే సమావేశంలో ఎలాంటి పొరపట్టు జరగకుండా చూస్తామన్నారు. అదే విధంగా వ్యవసాయ శాఖ అధికారి కల్పన హాజరు కాకపోవడంతో సమస్యలపై ఎం చర్చించాలని సభ్యులు కలెక్టర్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి వారి ప్రగతి నివేధికలు చదివి వినిపించారు. పలువురు సభ్యులు సమస్యలను సభ దృష్టికి తీసుకు రాగా వాటిని పరిష్కరించేలా చూడాలని కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్ల భాగ్యలక్ష్మీ అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి పత్తిని తీసుకువచ్చి జిల్లాలో అమ్ముతున్నారని, సీసీఐ, మార్కెటింగ్ అధికారులు సహకరిస్తున్నారని వైస్ చైర్మెన్ సత్యనారాయణ ఆరోపించారు. జిల్లా రైతులకు మద్దతు ధర కంటే రూ .500 తక్కువ చెల్లిస్తున్నారని చెప్పారు. మహారాష్ట్ర పత్తి కొనుగోళ్ళ చేయకుండా చర్యలు తీసుకుంటూ, జిల్లా రైతులకు న్యాయం చేస్తామని మార్కెటింగ్ ఏడీ గజానంద్ తెలిపారు. సమావేశాలకు అధికారులు రాకపోవడంతో సమస్యలపై ఎలా చర్చించాలని లక్షెట్టిపేట్ జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య ప్రశ్నించారు. రైతు వేదికల్లో అధికారులు కానరావడం లేదని, కౌలు పత్రాల కోసం రైతులు రైతు వేదికలకు వెళ్తే ఇంటి రమ్మంటూన్నారని, అలాంటప్పుడు రైతు వేదికలు ఎందుకో అధికారులు చెప్పాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించని వ్యవసాయ శాఖ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీఏఓ భరోసా సమాదానం చెప్పారు. ఉద్యానవన శాఖ అధికారులు ఎలా, ఎక్కడ ఉంటారో తెలియడం లేదనీ సభ్యులు అన్నారు. ఉద్యానవన పంటలపై ఇప్పటి వరకు అవగాహన, సూచనలు చేసిన దాఖలు లేవని సభ్యులు ఆరోపించారు. బెల్లంపల్లిలో మామిడి మార్కెట్ ఏర్పాటు చేయాలని బెల్లంపల్లి, నెన్నెల్, భీమిని, కన్నెపల్లి మండల జెడ్పీటీసీలు కోరారు. గ్రామాలకు రోడ్లు వేయకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని, కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో వాహనాలకు డబ్బులు వసూలు చేస్తున్నారని, భారీ వాహనాలను జన్నారం రాకుండా అడ్డుకుంటున్నారని జన్నారం జెడ్పీటీసీ చంద్రశేఖర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో వంగిపాయిన స్తంభాలను సరి చేయడం లేదని, డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా చర్యలు తీసుకోవడం లేదంటూ విద్యుత్ శాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు లెవనేత్తిన సమస్యలపై అధికారులు స్పందించి పరిష్కరించడంతో పాటు తీసుకున్న చర్యలను వారిని తెలియజేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ జెడ్పీ సీఈఓ గణపతి పాల్గొన్నారు.

సింగరేణి కొత్త గనులకు పూర్తి స్థాయి సహకారం

- బొగ్గు ఉత్పత్తి,రవాణాలో సింగరేణి పనితీరు బాగుంది
- కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి సంస్థ పని తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా కొత్త గనులకు పూర్తి స్థాయి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. శుక్రవారం సింగరేణి భవన్‌లో ఉన్నత స్థాయి సమిక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నిర్దేశించిన 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందుండటాన్ని అభినందించారు. సింగరేణి సీఎండీఎస్ బలరామ్‌తో పాటు ఇతర డైరెక్టర్లతో సంస్థ ప్రగతిపై సమీక్షించారు. సింగరేణి ప్రస్తుత పనీతీరు భవిష్యత్తు ప్రణాళికలపై చైర్మెన్ బలరామ్ వివరించారు. సింగరేణి ప్రాంతంలో మూడు బొగ్గు బ్లాకుల కెటాయింపు పద్దతిలో సింగరేణి సంస్థకు కెటాయించేలా చూడాలని కోరారు. రానున్న కాలంలో చేపట్టనున్న కొత్త గనులకు త్వరితగతిన అనుమతులు లభించేలా చూడాలని విన్నవించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ శాఖ కార్యదర్శి స్పందిస్తూ నిబంధనలకు లోబడి సింగరేణికి మేలు కలిగే విధంగా తగిన సహకారాన్ని అందిస్తామని, సింగరేణి భవిష్యత్తుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చారు. అదే విధంగా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన థర్మల్, సోలార్ ప్రాజెక్టుల పనీతీరును అడిగి తెల్సుకున్నారు. సింగరేణి చేపట్టిన వ్యాపార విస్తరణ చర్యలపై థర్మల్, సోలార్, జియో థర్మల్, ఓబీ నుండి ఇసుక ఉత్పత్తి, కమర్షియల్ ఇసుక తయారీ తదితర ప్రాజెక్టులపై అభినందించారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ బ్రార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్, సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణ రావు, వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి,ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఆల్విన్, జీఎం సురేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా మురళీకృష్ణ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మురళీకృష్ణ గతంలో మహబూబాద్ మరిపెడ మున్సిపల్ మేనేజర్‌గా పనిచేశారు. క్యాతనపల్లి మున్సిపల్‌కు కమిషనర్‌గా పదోన్నతితో బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలువల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తూముల భవిష్యత్, సంయుక్త కార్యదర్శి పోలుదాసరి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం తహసీల్దార్‌గా సదానందం

నవతెలంగాణ-జైపూర్

భీమారం తహసీల్దార్‌గా శుక్రవారం సదానందం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన విశ్వంబర్ జగిత్యాలుకు బదిలీ కాగా వేమనపల్లిలో పని చేసిన సదానందం ఇక్కడికి బదిలీపై వచ్చారు. అదేవిధంగా జైపూర్ తహసీల్దార్‌గా వనజా రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన రమేష్ వేమనపల్లికి బదిలీ కాగా నస్పూర్‌లో పని చేసిన వనజా రెడ్డికి ఇక్కడికి బదిలీపై వచ్చారు. భీమారం తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సదానందంను రేషన్ షాపు డీలర్లు కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

ఎస్టీపీపీని సందర్శించిన బోర్డు చైర్మెన్



నవతెలంగాణ-జైపూర్

కేంద్ర కార్మిక శాఖ ద్వారా నియమితులైన కాంట్రాక్టు కార్మికుల బోర్డు చైర్మెన్ సురేంద్ర కుమార్ శుక్రవారం ఎస్టీపీపీని సందర్శించి కార్మికుల సమస్యలు జీతభత్యాల చెల్లింపులపై చర్చించారు. కాంట్రాక్టు కార్మికులతో సమావేశమైన ఆయన అనంతరం ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ చిన్న బస్వీరెడ్డి, కాంట్రాక్టు అధికారులతో స్థానిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బీఎంఎస్ అనుబంధ ఎస్టీపీపీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ యూనియన్ నాయకుల ద్వార మౌళిక సదూపాయాల విషయమై చర్చించి తదుపరి పర్యటనలో పూర్తి స్థాయిలో సమావేశమై సమస్యల పరిష్కారానికి సింగరేణి యాజమాన్యంతో చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హక్కులు సక్రమంగా అమలు చేయడం లేదని కార్మికులు ఆయనకు విన్నవించారు. నిబంధనల ప్రకారం విధుల నిర్వాహణ కొనసాగడం లేదని, ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ చేసే కార్మికులలో డస్ట్‌కు సంబంధించిన అవెన్స్, శబ్దకాలుష్య, సబ్సీడీతో క్యాంటీన్ విషయంలో యాజమాన్యం పూర్తిగా అలసత్వ ధోరణి అవలంబిస్తోందన్నారు. కార్మికుల ఆరోపణలపై 15 రోజుల వ్యవధిలో యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సభ్యులు యాదగిరి సత్తయ్య, ఎస్టీపీపీ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ప్రొటెక్షన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, వర్కింగ్ ప్రసిడెంట్ తొగరి కృష్ణ, ఉపాధ్యక్షులు చిలకాని వెంకటేశ్వర్లు, పాత శికృష్ణ, మద్దూరి రాజు యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈగ సురేందర్, బోడకుంట శ్రీధర్, జాయింట్ సెక్రటరీ అట్ల సుమన్, అంట్ల అంజిరెడ్డి, కాళ్యాణపు సతీష్, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఎం కిసాన్ లబ్దిదారులు ఈకేవైసీ చేసుకోవాలి

నవతెలంగాణ-పెంబి

ప్రధానమంత్రి కిసాన్ సమాన్ నిధి పథకంలో భాగంగా రైతులకు పంట పెట్టుబడి కొరకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంవత్సరానికి రూ.6వేల ఉచిత ఆర్థిక సాయం పొందాలంటే లబ్దిదారులు తప్పనిసరిగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని ఏఈఓ రాజ్ కుమార్ తెలిపారు. ఫిబ్రవరి నెల 14వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మండలంలో ఈ కేవైసి డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పీఎం కిసాన్ నగదు లబ్ది పొందుతున్న లబ్దిదారులందరూ తప్పనిసరిగా సమీపంలో ఉన్న మీ సేవ కేంద్రాలలో కానీ, పోస్ట్ ఆఫీస్‌లో, లేదా మొబైల్ ద్వారా గూగుల్‌లో పీఎంకిసాన్ వెబ్ సైట్‌లో మొబైల్ ఓటీపీ పద్ధతులలో ఏదో ఒక విధానం ద్వారా తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని అన్నారు.

బదిలీపై వచ్చిన ఎంపీడీఓకు సన్మానం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపీడీఓ రమేష్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు భీమ బుచ్చన్న నాయకులు వంశీ, నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అంజనిపుత్ర రియల్ ఎస్టేట్స్ కంపెనీ అధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా కంపెనీ డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్న కుమారి పాల్గొని టాస్ వేసి ప్రారంభించారు. గురు టీమ్ టాస్ గెలిచి, బ్యాటింగ్ ఎంచుకోగా వాన్సట్ టీమ్ ఫీల్డింగ్ చేశారు. అనంతరం విజేత టీమ్‌కు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో కంపెనీ సభ్యులు కంకటి కృష్ణ, జంగం మహేష్, మల్యాల కృష్ణకాంత్, కంపెల్లి శ్యామ్, మల్యాల సంప్రీత్, కేమ గంగయ్య కంపెల్లి శ్యామ్, సత్యా ఉన్నారు.

బోథ్ సీఐగా బి.రమేష్

నవతెలంగాణ-బోథ్

బోథ్ సీఐగా బి.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు విధులు నిర్వహించిన భీమేష్ బదిలీపై ఇచ్చోడకు వెళ్లడంతో మహబూబ్ నగర్ జిల్లా రూరల్ సర్కిల్ నుంచి బదిలీపై బోథ్‌కు వచ్చారు.

ఘనంగా రేణుకా మాతా ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల్ రేణుక మాత ఎల్లమ్మ ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 16వ తేదీ శుక్రవారం నుంచి 27వ తేదీ మంగళవారం వరకు ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. మొదటి రోజు వడ్యాల్ గ్రామంలో పెద్ద గౌడ్ ఇంటి వద్ద గడపావన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల గౌడ సంఘ సభ్యులు అక్కడికి చేరుకొని ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గడపవన అనంతరం గ్రామంలోని గౌడ సంఘ సభ్యుల ఇండ్ల వద్దకు దాత లైనుల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా పెద్ద ఎత్తున బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహిస్తారు. నేటి నుండి మండలంలోని ప్రతి గ్రామం తిరుగుతూ ఉత్సవాలనాటికి గడపావనం గ్రామానికి చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు నారా గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, అంజా గౌడ్, రాజా గౌడ్, వేణుగౌడ్, లింబగౌడ్, రవీందర్‌గౌడ్, నర్సగౌడ్, గంగాధర్‌గౌడ్, హనుమాగౌడ్, రమణాగౌడ్, రాజు గౌడ్, సాయి గౌడ్, బాబుగౌడ్, నవీన్‌గౌడ్, సురేష్‌గౌడ్‌లతో పాటు మండల గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడిని కలిసిన గొర్ల రాజు యాదవ్

నవతెలంగాణ-బోథ్

తెలంగాణ రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు గంధముల ఆనంద్ గౌడ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా ఓబీసీ అధ్యక్షులు గొర్ల రాజుయాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీసీ లందరూ ఏకతాటిపై వచ్చి బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసి రాష్ట్ర ంలో అన్ని ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఓబీసీ మోర్చా ముందుండి బాధ్యతలు వహించాలన్నారు. ప్రధాని బీసీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ చేరే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చూస్తామన్నారు.

మందమర్రి ఎస్ఐగా రాజశేఖర్

నవతెలంగాణ-మందమర్రి

ఎస్ఐగా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ చంద్రకుమార్ లక్షెట్టిపేటకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాజశేఖర్ వచ్చారు. 2020బ్యాచ్‌కు చెందిన రాజశేఖర్ ఎన్టీపీసీలో పిఎస్ఐ, నెన్నెల, తాండూర్‌లలో ఎస్ఐగా పనిచేసిన అనుభవం ఉంది. 2021లో మందమర్రి 2వ ఎస్ఐగా పనిచేయడంతో పట్టణం పట్ల పూర్తి అవగాహన ఉంది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

నవతెలంగాణ - వేమనపల్లి

రాబోయే మెగా డీఎస్సీలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం కోసం జీవో నెం.97 ద్వారా అనుమతించబడిన 1523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఓయూ జెఏసి నాయకులు దుర్గం మల్లేష్ రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ, సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి తప్పకుండా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి రాబోయే మెగా డీఎస్సీలో 1523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ వచ్చేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జాజిమొగ్గ గణేష్ పాల్గొన్నారు.



బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై కన్నెర్ర

● పలు చోట్ల నిరసనలు, గ్రామీణ భారత్ బంద్ విజయవంతం

నవతెలంగాణ-నస్పూర్

బీజేపీ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై కార్మికులు, కర్షకులు కన్నెర్ర చేశారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాల కార్మికులు పలు పద్ధతుల్లో నిరసన తెలిపారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం, సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం సిఐటియు కార్యాలయం నుండి శ్రీరాంపూర్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద కేంద్ర బీజేపీ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజా, కార్మిక సమస్యలు పట్టించుకోకుండా ప్రజలను, రైతులను, కార్మికులను, వ్యవసాయ కూలీలను ప్రమాదంలోకి నెట్టే చట్టాలను తీసుకొచ్చి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి ఆర్థిక వనరులైన ప్రభుత్వ రంగ సంస్థలను లీజు పేరుతో ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. బీజేపీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాల వల్ల దేశంలోని రైతాంగం కూలీలుగా మారుతున్నారన్నారు. ఉపాధి హామీ చట్టానికి తక్కువ బడ్జెట్ కేటాయిస్తు నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. ప్రతి కూలీకి 200 రోజులు పని కల్పిస్తూ, రోజుకు రూ.600 కూలి చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయొద్దని, దేశంలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న బొగ్గు బావులను, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుండడంతో కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రాబోయే రోజుల్లో కార్మికులందరూ కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాటాలకు సిద్ధం అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగల శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, ఎస్‌సీకేఎస్ బ్రాంచ్ అధ్యక్షులు మహేందర్, రమేష్, లింగన్న పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో

దేశవ్యాప్త గ్రామీణ బంద్, సమ్మెలో భాగంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ), సిపిఐ ఆధ్వర్యంలో సిసిసి కార్నర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన గ్రామీణ బంద్, సమ్మె విజయవంతమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు పరిశ్రమలను ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నిస్తోందని, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా పెట్టుబడిదారులకు కట్టబెడుతోందని పేర్కొన్నారు. కార్మికులను పనిచేసే యంత్రాలుగా పరిగణిస్తూ 12గంటల పని దినాన్ని అమలు చేయడానికి చూస్తోందన్నారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరు కొమురయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు కారుకూరి నగేష్, ఫిట్ కార్యదర్శులు మోతే లచ్చన్న, గునిగంటి నర్సింగారావు, ఏరియా కార్యదర్శి మారేపల్లి సారయ్య, బద్రి బుచ్చయ్య, సిహెచ్ నవీన్‌రెడ్డి, మొగిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

చెన్నూర్‌లో భారీ ర్యాలీ

జైపూర్ : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి గుణ పాఠం తప్పదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. కార్మిక సంఘాల పిలుపు మేరకు శుక్రవారం చెన్నూర్ పట్టణంలో చేపట్టిన సమ్మెలో కార్మికులు, కర్షకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. పట్టణంలోని కోటపల్లి బస్టాండ్ రావి చెట్టు నుండి కొత్త బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, కర్షకులు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంకె రవి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తయారు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెస్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో సీఐటీయూ నాయకులు బోడంకి చందు, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గోపీనాథ్, సీపీఐ నాయకులు మాసాని రమేష్, సమ్మన్న, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు చందు, మధ్యాహ్న భోజనం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసి గిరిజన సంఘం, మహిళా సంఘం, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, ఇండ్ల స్థలాల పోరాట సంఘం, రైతు సంఘం నాయకులు కరీమ, కుమార్, మణి, బండారి రాజేశ్వరి, సిడాం సమ్మక్క, నాగజ్యోతి, కావేరి, మధుకర్, అనిల్, ఆవాజ్ సహన బేగం, ఉమారాణి, తుమ్మ రేణుక, బోయిర్ రమాదేవి, టేకం రాజమ్మ, చంద్రన్న, డోంగిరి రాజన్న పాల్గొన్నారు.


నస్పూర్‌లో..

జన్నారం : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కనికరం అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మగ్గిడి జయ, ప్రమీల, గుడ్ల రాజన్న, సిఐటియు నాయకులు కె బుచ్చయ్య, సిఐటియు మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్, ఐఎఫ్టియు రైతు కూలి సంఘం నాయకులు లక్ష్మీకాంతం, గ్రామీణ పేదల సంఘం నాయకులు వేముల నర్సయ్య, సిందం రాజమౌళి, సంధ్య పాల్గొన్నారు.

కాసిపేట : సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ల వేలం పాట ఆపివేసి, సంస్థకు కేటాయించాలని, అలాగే వేలం పాటలో సింగరేణి యాజమాన్యం పాల్గొనే విధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోమగూడెంలో సమ్మెను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో నడుస్తున్న 160 బొగ్గు గనులను క్యాపిటల్ మానిటైజేషన్ పేరుతో అమ్మివేస్తుందని, కొత్తగా మైన్స్‌ను కేటాయించడం లేదని, సింగరేణిలో ప్రైవేటీకరణను వెంటనే ఆపివేసి, కోల్ ఇండియాలో కేంద్ర ప్రభుత్వం వాటాలను అమ్మరాదని, బొగ్గు బ్లాక్ల వేలంలో ఆదానీకి మేలు చేయడానికి మోడీ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 2021లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఐదు కనీస వేతన జీఓలను వెంటనే గెజిట్ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్, జాడి పోశం, మంతెన రమేష్, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కార్యదర్శి వి రాజేందర్, నరేందర్, రఘురాం, ఎం భాస్కర్, కొమురయ్య, పి స్వామిదాస్, సుందరం, అంజి, కుందేళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.


జైపూర్ : చెన్నూర్‌లో ర్యాలీ


జన్నారం : సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ



కాసిపేట : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ

యువతకు క్రీడా మైదానాలు నిర్మించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

నేటి యువత క్రీడా మైదానాలు లేక క్రీడలకు దూరమవుతున్నారని, వారికి అవసరమైన క్రీడా మైదానాలను నిర్మించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీ నగర్‌లో అండర్ ఆర్మ్ క్రికెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీలలో విజేతగా నిలిచిన గాంధీనగర్ జట్టుకు రూ. 30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రభు ఎలెవన్ జట్టుకు రూ. 15 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరమని అన్నారు. క్రీడలు స్నేహభావాన్ని కూడా పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దుర్గం ప్రవీణ్, నాయకులు ముస్తఫీజ్, జాడి శ్యాంరావు, నక్క మనోహర్, కె రాజు, బైరం నరేష్, సింగారావు, వంశీ పాల్గొన్నారు.

ఘనంగా గణిత శాస్త్రవేత్త జయంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

గణిత శాస్త్రవేత్త సర్దార్ ధర్మేందర్ సింగ్ చౌహల్ జయంతిని శుక్రవారం పురస్కరించుకొని స్థానిక ధర్మ విద్యాలయం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ధర్మేందర్‌సింగ్‌ను గుర్తు చేసుకుని చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్దార్ చౌహాన్‌సింగ్ మాట్లాడుతూ ఆయన గణితానికి చేసిన సేవలు వెల కట్టలేనివన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సర్దార్ సోహన్ సింగ్ చౌహల్, ప్రిన్సిపాల్ స్వప్నలత, మేనేజ్మెంట్ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా రవాణా శాఖాధికారిగా రాంచందర్ బాధ్యతలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా రవాణా శాఖ అధికారిగా ఎల్. రాంచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన గంధం లక్ష్మి వరంగల్ జిల్లాకు బదిలీ కాగా హైదరాబాద్‌లో పనిచేస్తున్న రాంచందర్‌ను జిల్లాకు నియమించారు. ఏవో అరుణాబాయి, ఎంవీఐలు సంతోష్, శ్రీకాంత్, చక్రవర్తి, సిబ్బంది వినీల్, రజిత, సంతోష్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిటిఓ జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే, ఎస్పీ సురేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిరం ఉన్నత పాఠశాల, రబీంద్ర, అక్షర, మండలంలోని ఫ్యూచర్ స్కూల్, భాష్యం, శ్రీవిద్య పాఠశాలలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సకల శక్తి ప్రధాత సూర్య భగవానున్ని పూజించి విద్యార్థులు ఉపాధ్యాయులు సూర్య నమస్కారాలు చేశారు. సూర్య నమస్కారాలతో మనిషి శారీరకంగా దృఢమవడమేగాక తేజస్సు పెరిగి బుద్ధి వికసిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు సారథి రాజు, సాయినాథ్, సుభాష్, ప్రవీణ్, మాధవ్‌రావు, సంతోష్ పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ తెలిపారు. శుక్రవారం న్యూ హౌజింగ్ బోర్డు కాలనీలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పూజలు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ తెలిపారు. ఇక్కడి నుంచే కార్యకలపాలను సాగిస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు ఇక్కడికే రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అభినవ్ సర్దార్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీఓకు ఘనంగా సన్మానం

లక్ష్మణచాంద : మండల కేంద్రం నుంచి ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ శేఖర్‌ను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ అధికారులు కష్టపడి పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని, మండలానికి ఎంపీడీఓగా అందించిన సేవలు కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ మాట్లాడుతూ ఎంపీడీఓగా శేఖర్ ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపితే చిరకాల గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నసీరుద్దీన్, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, ఏపీఓ ప్రమీల, ఎంపీటీసీ తిప్పని రాజేశ్వర్, నాయకులు పడిగెల సురేష్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీఎంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి ఎస్పీఎం సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల కష్టాలను తీర్చడంలో మిల్లు యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ, వారి హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. స్థానికులకు తక్కువ జీతాలు ఇస్తూ, స్థానికేతరులకు అత్యధిక జీతాలు చెల్లించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దీనికి ముందు ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ 2013 నుండి మిల్లులో ఎన్నికలు నిర్వహించడం లేదని అన్నారు. దీనితో కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రవీణ్‌కుమార్‌కు వివరించారు. మిల్లులో కనీసం క్యాంటీన్ సౌకర్యం లేదని, ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స చేసే నాథుడు లేదని అన్నారు. ఇప్పటికీ 197 మంది పర్మినెంట్ కార్మికులను యాజమాన్యం విధుల్లోకి తీసుకోలేదని, ఉద్యోగ విరమణ చేసిన కాంట్రాక్టు కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వడం లేదని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించేలా చూడాలని ప్రవీణ్‌కుమార్‌ను కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాగేశ్వర్‌రావు, అంబాల ఓదేలు, రాజనర్సయ్య, ఆనంద్‌కుమార్, పొన్న రమేష్, శివప్రసాద్, పురుషోత్తం ఉన్నారు.


ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

అసైన్డ్ భూములలో ప్లాట్ల విక్రయాలు నిలిపేయాలి

కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ సమీపంలో ఉన్న అసైన్డ్ భూములలో ఏర్పాటు చేస్తున్న అక్రమ వెంచర్లలో ప్లాట్ల విక్రయాలు నిలిపివేయాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 190లోని అసైన్డ్ భూములలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. సాగు కోసం కేటాయించిన అసైన్డ్ భూములను ప్లాట్లుగా విభజించి విక్రయించడం నేరమని తెలిసినా అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికుల హక్కుల రక్షణకు సంఘటితంగా పోరాడుతాం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కార్మికుల హక్కుల రక్షణకై సంఘటితంగా పోరాడుతామని ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న అన్నారు. శుక్రవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తహసీల్దార్ జానకికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయినా కూడా రైతాంగం, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థలను సహజ వనరులను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగిస్తూ, దేశ ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. నాలుగు బొగ్గు గనులను వేలం వేయడానికి సిద్ధమైందని మండిపడ్డారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న, కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి, కనీస వేతనాలను నిర్ణయించే విధానానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏసు, లక్ష్మి, సాయన్న, రాజేందర్ పాల్గొన్నారు.

నార్నూర్ : కార్మికుల సమస్యలను పరిష్కరించాలనీ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.నవీన్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఝాడే నాందేవ్ అన్నారు. శుక్రవారం దేశ వ్యాప్తంగా తల పెట్టిన కార్మిక సమ్మె భారత్ బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆయా కార్మిక సంఘాలతో ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో అంగన్‌వాడీ మండల యూనియన్ సభ్యులు పంచశీలా, మధ్యాహ్న భోజన యూనియన్ సభ్యురాలు ఝాడే తాయి, కార్మికులు శివబాయి, మోయినోద్దీన్, దేవిదాస్, చాంద్‌పాషా, పంచపులా, లీలబాయి, సంగీతా, సావిత్రి, కవిత, రాంజీ, వెంకట్, సురేందర్ పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షల సందర్భంగా శుక్రవారం డీఐఈఓ రవీందర్ కుమార్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, కనీస సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలు, ఎంసెట్, నీట్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూరప్రకాష్, మురళీధర్, అధ్యాపకులు ఉన్నారు.

ప్రతి గ్రామానికి రోడ్డు వేసే బాధ్యత తీసుకుంటాం

నవతెలంగాణ-నేరడిగొండ

ప్రతి గ్రామానికి రోడ్డు వేసే బాధ్యత తీసుకుంటామని బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుమారి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆడే వసంత్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, నాయకులు భీమ్‌రాజ్ గౌడ్, నారాయణ్‌గౌడ్, శ్రీధర్, సంతోష్, బ్రహ్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైగా సుమాంజలి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-దిలావర్‌పూర్



మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా పోగుల సుమాంజలి శుక్రవారం భాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎస్సై యాసిర్ అరాఫత్ దస్తురాబాద్‌కు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సైని, ఏఎస్సై భీంరావు, పోలీసు సిబ్బంది శాలువాతో సత్కరించి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. పోలీసు సిబ్బంది అందరూ సానుకూలంగా పనిచేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

దస్తురాబాద్ : నూతన ఎస్సైగా శుక్రవారం ఎండీ యాసిర్ అరాఫత్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా విధులు నిర్వహించిన ప్రభాకర్‌రెడ్డి నిర్మల్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో దిలావర్‌పూర్ పోలీస్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన యాసిర్ అరాఫత్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి, ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల ప్రజలు సహకరించాలని అన్నారు.

పాఠశాలలో ధర్మేందర్ సింగ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఏస్సీఈఆర్టీ మెంబర్ సర్దార్ ధర్మేంద్ర సింగ్ జయంతి వేడుకలను శుక్రవారం ఎస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దుర్గానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేసి ధర్మేంద్ర సింగ్ సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, గంగాసాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మెన్ పాల్గొన్నారు.